క్లుప్తంగా

నేడు డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్

పరకాల : మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుష్మ తెలిపారు. నేడు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు చేపట్టనున్న కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. 7993361942 ద్వారా ఏలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి ఫోన్ ద్వారా తెలుపాలని కమిషనర్ కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆత్మకూరు : మండలంలోని కామారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. కామారం గ్రామానికి చెందిన కెత్తె స్వామి హనుమకొండలోని తన చిన్నకుమారుడి ఇంటికి ఈనెల 3న వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు బీరువా తాళాలు ధ్వంసం చేసి రూ.20వేలు అపహరించినట్లు స్వామి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

పరకాలలో నేడు శ్రీవాణి సంతాప సభ

పరకాల : రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న శ్రీవాణి సంతాప సభ సోమవారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని ఓ గార్డెన్‌లో జరుగనున్న సంతాప సభకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యతో తరలి రావాలని కోరారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి



పరకాల : సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం మండలంలోని మల్లక్‌పేటలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు దాస్, శంకర్, చార్లెస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

సింగిల్‌విండో మాజీ చైర్మన్ మృతి



రవీందర్‌రెడ్డి (ఫైల్)

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెం సింగిల్‌విండో మాజీ చైర్మన్ మాదాడి రవీందర్‌రెడ్డి (86) అనారోగ్యంతో మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. రవీందర్‌రెడ్డి 1992 నుంచి 1997 వరకు మర్రిపల్లిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడిగా పని చేశారు. ఎస్సారెస్పీ కాల్వల అభివృద్ధికి కృషిచేశారని రైతులు గుర్తుచేసుకున్నారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

రామన్నపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం గడిచినా నేటికీ విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించలేదని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దాంతో పర్యవేక్షణ కరువై అధికారుల్లో తీవ్ర అలసత్వం పెరిగి, విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ విద్యా సంవత్సరం పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ తీవ్ర గందరగోళంగా మారిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి పాలిసెట్ సీట్ల కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తిచేయించేందుకు కృషిచేయాలని కోరారు.

దేశం కోసం పదవులు త్యాగం

హన్మకొండ: దేశం కోసం పదవులను త్యాగం చేసిన జాతీయవాది, జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి కొనియాడారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం జరుపుకున్నారు. తొలుత శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఏక్ దేశ్ మే దో నిశాన్, దో విధాన్, దో ప్రధాన్ నహి చలేంగే, నహీ చలేంగే..' అంటూ జమ్మూ కశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు కోసం పోరాడుతూ అసువులు బాసిన త్యాగశీలి శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని గుర్తుచేశారు. సత్యనారాయణ రావు, కందగట్ల సత్యనారాయణ, నాను నాయక్, నాంపల్లి శ్రీనివాస్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరందుకున్న వరినాట్లు



నాటు వేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు



మండల కేంద్రంలోని పొలంలో నాటు వేసిన రైతు

- రోహిణి కార్తెలో అలికిన మొలక
- సిద్ధంగా ఉన్న నారుమడులు
- ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలని రైతులు డిమాండ్

ఎల్కతుర్తి : మండలంలో ఖరీఫ్ సీజన్ వరినాట్లు జోరందుకున్నాయి. రోహిణి కార్తెలో మొలకలు అలికిన రైతులు నారుమడులు సిద్ధం అవడంతో రైతులు కూలీల సాయంతో నాట్లు వేస్తున్నారు.

యాసంగిలో తెగుళ్ల బెడద

యాసంగి సీజన్‌లో నాట్లు వేసిన రైతులకు తెగుళ్ల బెడద తప్పలేదు. దీంతో అధికారుల సూచనల మేరకు ఎరువులు, పరుగుమందులు పిచికారీ చేసి కొంతమేరకు తెగుళ్లను నివారించగలిగారు. పంట కోతదశకు చేరుకున్న సమయంలో కురిసిన అకాల వర్షాలకు కాస్త నేలవాలి ధాన్యం రాసులు రాలిపోయి కొంతమేర నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. అయినప్పటికీ రైతులు అధైర్యపడకుండా ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ట్రాక్టర్లతో పొలాలు దున్ని, కాడెడ్లతో గొర్రు కొడుతున్నారు. పలు చోట్ల మేల్, ఫిమేల్ సీడ్ నాట్లు వెస్తున్నారు.



నాటు వేస్తున్న కూలీలు

సూరారం, దండేపల్లి, ఎల్కతుర్తి, చింతలపల్లి, ఇందిరానగర్, గోపాల్‌పూర్ తదితర గ్రామాల్లో నాట్లు ఊపందుకున్నాయి. మిగతా గ్రామాల్లో నారుమడులు సిద్ధంగా ఉన్నాయి.

సాగు విస్తీర్ణం

మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలకు సుమారు 23వేల ఎకరాలు సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో ఇప్పటి వరకు వరిసాగు 1000 ఎకరాలు, పత్తి 3,400 ఎకరాలు, మొక్కజొన్న 60 ఎకరాలు, కంది 10 ఎకరాలు, పెసరా 15 ఎకరాలు, 300 ఎకరాలు మామిడి, 80 ఎకరాలు ఆయిల్‌పాం తదితర పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఎస్సారెస్పీ కాల్వ నీరు వదిలినట్లెతై ఎస్సారెస్పీ నీరు విడుదల చేసినట్టైతే వరిసాగు మరింత అధికంగా సాగు చేసే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

నాట్లు ఊపందుకున్న నేపథ్యంలో ఎస్సారెస్పీ కాల్వ నీరు విడుదల చేయాలి. ప్రస్తుతం బోరు బావుల్లోని నీటితో పంట సాగుచేస్తున్నాం. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగునీటిని విడుదల చేసినట్లెతై సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి నీటిని విడుదల చేయాలి.

- అల్లకొండ రాజు, రైతు

ఎరువులను అధికంగా వాడొద్దు

వరిసాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు అధికంగా వాడొద్దు. వీలైనంత వరకు సేంద్రియ ఎరువుల వినియోగం వైపు మొగ్గుచూపాలి. పచ్చిరొట్ట, కంపోస్టు ఎరువులను విరివిగా వాడాలి. దీంతో భూసారం పెరిగి అధిక దిగుబడులు వచ్చే అకాశం ఉంటుంది.

- రాజ్‌కుమార్, ఏఓ

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి



నల్లమారెమ్మ బ్రిడ్జిపై రాస్తారోకో చేపట్టిన గ్రామస్తులు, రైతులు

- రైతులు, గ్రామస్తుల ఆందోళన

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామం వరంగల్-ఖమ్మం రహదారికి అనుకుని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను తొలగించాలని ఆదివారం రైతులు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓ వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా నల్లమారమ్మ వాగు బ్రిడ్జి వద్ద అక్రమంగా ఫంక్షన్ హాల్ నిర్మించినట్లు ఆరోపించారు. ఈ నిర్మాణంపై కోర్టు తీర్పును అధికారులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇట్టి నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో ఉండగా నిర్మాణాల కూల్చివేతకు సంబంధించి గ్రామపంచాయతీ అధికారులు మూడు సార్లు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. అయినప్పటికీ అక్రమ నిర్మాణాలు కూల్చివేయలేదని వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుని భూములు, పంటలు కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రాస్తారోకో నిర్వహించిన వారిలో విక్రమ్ రావు, భాస్కర్‌రావు, యాకయ్య, పూర్ణచందర్‌రావు, కుమారస్వామి, రాజు, లక్ష్మి, సాంబయ్య, శశిధర్, రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చక్రపాణి

నడికూడ : గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ డిమాండ్ల సాధన కోసం ఈనెల 9వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో చక్రపాణి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని కుట్ర పన్నుతుందని అన్నారు. కేంద్రం అమలు చేయాలని చూసే లేబర్ కోడ్‌లతో కార్మికులకు సమ్మె చేసే హక్కు, సమిష్టి బేరసాల హక్కు, ఉద్యోగ భద్రత ఉండదని, కనీస వేతనాలు అమలు కాకుండా పోయే పరిస్థితి నెలకొంటుందని అనుమానం వ్యక్తం చేశారు. సమ్మెకు పంచాయతీ కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. సాంబయ్య, రమేశ్, రాజేశ్, శంకర్, రవి, రాజయ్య, విజయ్, వెంకటేశ్, రత్నం పాల్గొన్నారు.

'శ్యామాప్రసాద్'ను ఆదర్శంగా తీసుకోవాలి



శాయంపేట : శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దామెరలో..

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి

దామెర : నేటి తరం యువత డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి అన్నారు. అయన జయంతిని పురస్కరిచుకుని మండలంలోని ఊరుగొండలో ఆదివారం శ్యామాప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ.. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులుగా, విద్యావేత్తగా, దేశభక్తుడిగా శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు మధూకర్, నాయకులు ముఖేష్, మనోజ్‌రెడ్డి, సుమంత్, రమేశ్, రాజశేఖర్, పరుశరామ్, రవీందర్, చరణ్, రాజు, మురళి, కార్తీక్, హరీశ్ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కుమార్, జిల్లా నాయకులు సుదర్శరెడ్డి, యుగేందర్, వీరన్న, శ్రీరాములు, విజయ్, మండల ప్రధాన కార్యదర్శులు శివ ప్రసాద్ రెడ్డి, సందీప్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామృష్ణ మాట్లాడుతూ.. భారతదేశం ఐక్యత కోసం, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శవాది డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పు రాజు, నాగరాజు, రాజశేఖర్, సుమన్, రాజేష్, రమేశ్, చంద్రమౌళి, శ్రీధర్, ఆనంద్ పాల్గొన్నారు.

వైభవంగా బీరన్న బోనాల వేడుకలు



కమలాపూర్ : బోనాలతో తరలివెళ్తున్న మహిళలు



వేలేరు : లోక్యాతండా దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూరు : కంఠాత్మకూరులో బీరన్నస్వామికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కమలాపూర్ : మండలంలోని గూడూరు, ఉప్పల్ గ్రామాల్లో ఆదివారం బీరన్న బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. కురుమ, యాదవ మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా బీరన్న ఆలయాలకు తరలివెళ్లారు. అనంతరం బీరన్నకామరాతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గూడూరులో జరిగిన బీరన్న బోనాల వేడుకల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరులో ఆదివారం గొల్ల, కురుమ సంఘాల ఆధ్వర్యంలో బీరన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల, శివసత్తుల పూనకాల నడుమ మహిళలు బోనాలు సమర్పించారు.

వేలేరు : మండల వ్యాప్తంగా బీరన్న బోనాలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక్యాతండా గ్రామంలో మాజీ సర్పంచ్ మురావత్ అనురాధలింగం ఆధ్వర్యంలో గ్రామస్తులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని గొల్ల, కురుమలు బీరన్న దేవుడికి బోనాలు సమర్పించారు. కాగా షోడాషపల్లిలో భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకోగా భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి.

ఎల్కతుర్తి : యాదవ కులస్తులు ఆదివారం బీరన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా బీరన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. పిల్లాపాలను సల్లంగా చూడడంతో పాటు వర్షాలు కురిసి పాడిపంటలు పండాలని వేడుకున్నట్లు చెప్పారు. ఈ వేడుకల్లో కులపెద్దలు భిక్షపతి, వెంకటయ్య, రవి, కుమాస్వామి, చేరాలు, రవి, రాజ్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, సమ్మయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



ఆత్మకూరు : మహాదేవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శాయంపేటలో..

ఆత్మకూరు : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ప్రజలు ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు వైభవంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు అరుట్ల మాధవమూర్తి, శ్రీపార్వతిదేవి సమేత మహాదేవస్వామి పంచకూట శివాలయంలో అర్చకులు శ్రావణ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు.

దామెర : మండల వ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలను ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని దామేశ్వరాలయం, ఆంజనేయస్వామి, ఊరుగొండ లక్ష్మీనర్సింహస్వామి, రామలింగేశ్వరస్వామి, నాగమయ్య ఆలయం, పులుకుర్తి ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎల్కతుర్తి : తొలి ఏకాదశిని పురస్కరించుకుని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధ్యుల బారిన పడకుండా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. దీంతో ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. అలాగే కొత్తకొండ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి, శివమార్కండేయ, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల అర్చకులు ఉదయమే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తొలి ఏకాదశి పండుగ విశిష్టతను తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

కాజీపేట రూరల్: కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో భారతీయ రైల్వేలో కాజీపేట ఐకాన్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు, పి.రమేష్, నమిండ్ల మనోహర్, టోని, రాజు, తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి మండలి సభ్యుడికి సన్మానం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రజక సంఘం ఆధ్వర్యంలో భద్రకాళి అమ్మవారి ధర్మకర్త మండలి సభ్యుడు పాలడుగుల ఆంజనేయులును ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా కడిపికొండలోని సంఘం భవనంలో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వాయిలాల తిరుపతి, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, కోశాధికారి నార్లగిరి తిరుపతయ్య, గౌరవ అధ్యక్షుడు సారయ్య, చంద్రం పాల్గొన్నారు.

ఊరూరా పీరీల ఊరేగింపు



శాయంపేట : పీరీలతో ముస్లింలు



ఎల్కతుర్తి : పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

శాయంపేట : మండలంలో మొహర్రం పండుగ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో సవారీ (పీరీ)లతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పీరలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ సలీం, మహ్మద్ పాషా, ముగ్దున్‌పాషా, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మొహర్రం పండుగను మండల వ్యాప్తంగా ముస్లింలు నిర్వహించారు. పీరీలను వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పీరీలను ఆలింగనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంతో పాటు ఉప్పల్, భీంపల్లి, దేశరాజుపల్లి, అంబాల, పంగిడిపల్లి, గుండేడు తదితర గ్రామాల్లో ముస్లింలు మొహర్రం పండుగను ఆదివారం జరుపుకొన్నారు. ముస్లింలు తమ పూర్వీకులను స్మరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కులమతాలకు అతీతంగా ఆనందోత్సాహాల నడుమ పీరీలను ఊరేగించి, నిమజ్జనం చేశారు.

దామెర : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పీరీలను డప్పు చప్పుళ్లతో ఊరేగింపు చేపట్టారు. ఊరుగొండలో మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, మతపెద్దలు తాజొద్దీన్, ఆజంఖాన్, సాబీర్, కరీం, మదార్, ఇమ్రాన్, చోటే, యాకుబ్, అఫ్రోజ్, బైరత్, రషీద్, జహంగీర్, మొయిన్, అఖిల్, ఉస్మాన్ పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలో మొహర్రం వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. పీరీలను ఊరేగించిన అనంతరం కానుకలు చెల్లించుకునేందుకు కుల మతాలకు చిన్న, పెద్ద తేడా లేకుండా భక్తులు తరలివచ్చారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక చేయూత

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా అనంతసాగర్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న వరంగల్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని కొంగల హాసినికి ఓ దాత సహకారంతో విద్యా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక చేయూత నందించింది. అమెరికాలో ఉంటున్న కొండపెల్లి దీప్తి అందజేసిన రూ.లక్షా 7వేల విలువైన చెక్కును విద్యార్థికి విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్లా మహేందర్, ఒయాసిస్ ఆశ్రమ నిర్వాహకుడు ఒద్దిరాజు ప్రకాశ్ అందించారు. ఒయాసిస్ అనాథాశ్రమంలో ఆదివారం జరిగిన సమావేశంలో మహేందర్ మాట్లాడారు. విద్యా ఫౌండేషన్ విన్నపంతో హాసినిని దీప్తి దత్తత తీసుకున్నట్లు తెలిపారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న మహేందర్

సొంత ఖర్చుతో మరుగుదొడ్ల నిర్మాణం



హసన్‌పర్తి: 55వ డివిజన్ కోమటిపల్లిలోని చర్చిలో మరుగుదొడ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత ఆర్థిక చేయూతనందించారు. ఈ మేరకు మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆమె ఆదివారం ప్రారంభించారు. చర్చిలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక క్రైస్తవులు కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దాంతో స్పందించిన కార్పొరేటర్ రజిత.. సుమారు రూ.1.5 లక్షల సొంత ఖర్చుతో మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకొచ్చారు.